సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం | 8 | డిసెంబర్ | 2023



బడ్జెట్ తయారీలో బిజీబిజీ

పాఠశాలల్లో మౌలిక, భౌతిక అవసరాలను గుర్తించడంలో భాగంగా క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ బడ్జెట్ ప్లానింగ్ చేపడుతున్నారు.

8లో



12 టన్నుల బియ్యం స్వాధీనం

అక్రమంగా 12 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల అధికారులు గురువారం పట్టుకున్నారు.

కడలిలోకి 34 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 34,330 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ఇటీవలి వర్షాల నేపథ్యంలో తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు. మధ్య డెల్టాకు 200 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

నూతన గ్రంథాలయ భవనం రేపు ప్రారంభం



దాతలు నిర్మించిన గ్రంథాలయం

మామిడికుదురు: పాశర్లపూడిలంకకు చెందిన రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ వుండ్రు సూర్యనారాయణ స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఆ గ్రామంలో రూ.10 లక్షలతో నూతన గ్రంథాలయ భవనం నిర్మించారు. రెండున్నర సెంట్ల ప్రభుత్వ స్థలంలో ఐఏఎస్ అధికారులైన సూర్యనారాయణ కుమారులు, కోడళ్లు కాంతారావు, నీలిమారావు, రాజశేఖర్, నీరజ దంపతులు దీనిని నిర్మించారు. ఈ గ్రంథాలయ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం ప్రారంభించనున్నారు. ఈ గ్రంథాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా సూర్యనారాయణ కుటుంబ సభ్యులు సుమారు రూ.3 లక్షల వ్యయంతో వివిధ పుస్తకాలను అందుబాటులో ఉంచారు.

పునరావాస చర్యలపై దృష్టి పెట్టాలి

సాక్షి, అమలాపురం: తుపాను పునరావాస చర్యలపై అధికారులు దృష్టి పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావంతో దెబ్బ తిన్న రోడ్ల పునరుద్ధరణ, ఉద్యాన, వ్యవసాయ పంటల నష్టాల గణన, ముంపు బాధిత కుటుంబాలకు పరిహారాల చెల్లింపు, నిత్యావసరాల కిట్ల పంపిణీ, తుపాను సహాయక చర్యల కొనసాగింపుపై సమీక్షించారు. తుపాను బాధితులకు ఊరటనిచ్చేలా అధికార యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు.

రేపటి నుంచి 'నన్నయ'లో క్రీడా పోటీలు



ఆచార్య పద్మరాజు

రాజానగరం: సౌత్ అండ్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ వుమెన్ చాంపియన్‌షిప్ 2023–24 పోటీలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ వేదిక కానుంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, గోవా రాష్ట్రాల్లోని 90 యూనివర్సిటీల నుంచి పురుషుల జట్లు, 80 యూనివర్సిటీల నుంచి మహిళల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని వివరించారు. వర్సిటీ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరిగే పోటీల ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆర్‌కే రోజా, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ పి.ధ్యానచంద్ర తదితరులు హాజరవుతారని ఆచార్య పద్మరాజు తెలిపారు.

అన్నదాతకు వెన్నుదన్నుగా..

టీడీపీ హయాంలో..	వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..
ప్రకృతి వైపరీత్యాలు వస్తే అన్నదాతను పట్టించుకునే నాథుడు కూడా ఉండేవారు కాదు. పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు (పీపీసీ) ఉండేవి. నిబంధనలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని సైతం ఇక్కడ కొనేవారు కాదు. ఇక తడిసిన, తేమ ఉన్న ధాన్యం కొనాలంటే మిల్లర్లే శరణ్యం. కనీస మద్దతు ధర కన్నా రూ.200 నుంచి రూ.300 తగ్గించి కొనుగోలు చేసేవారు. పంట నష్టపోతే పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) ఇచ్చేందుకు ఆరు నెలల నుంచి ఏడాది కాలం పట్టేది.	మిచాంగ్ తుపానుకు కుండపోతగా వానలు కురిశాయి. కోతల సమయంలో రైతులను కుదేలు చేశాయి. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేగంగా స్పందించింది. రైతు కోలుకునే చర్యలకు ఉపక్రమించింది. తుపాను ప్రభావంతో ఈ నెల మూడో తేదీ రాత్రి మొదలైన వర్షాలు ఆరో తేదీ తెల్లవారుజాము వరకూ పడుతూనే ఉన్నాయి. ఈ సమయంలో సైతం ప్రభుత్వ యంత్రాంగం జిల్లాలో 14,278 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం విశేషం. తాజాగా తేమ ఉన్న ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పంట నష్టాల నమోదుకు శుక్రవారం శ్రీకారం చుట్టనున్నారు. పంట నష్టపోయిన రైతులకు ఈ నెలాఖరు లేదా జనవరి మొదటి వారంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్న సీఎం ఆదేశాలు రైతులకు ఊరటనిస్తున్నాయి.

- తడిసిన, తేమ ఉన్న ధాన్యం సేకరణ
- భారీ వర్షాల్లోనూ 14,278 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- సీఎం ఆదేశాలతో నేటి నుంచి క్షేత్ర స్థాయిలో పంట నష్టం నమోదు



కాట్రేనికోన మండలం కందికుప్పలో తేమ అధికంగా ఉన్న ధాన్యం కొనుగోలు



అల్లవరం మండలం ఎంట్రుకోనలో పంట నష్టం ప్రాథమిక అంచనా వేస్తున్న వ్యవసాయ అధికారులు



పలివెల చౌదరిపురంలో ధాన్యపు రాశిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

సాక్షి, అమలాపురం: జిల్లాలో మిచాంగ్ తుపాను వల్ల కలిగిన గాయం నుంచి అన్నదాతలు త్వరగా కోలుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఉపశమన చర్యలు చేపట్టింది. ఒకపక్క ప్రజాప్రతినిధులు, మరోవైపు అధికారులు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని.. పంట దెబ్బ తిన్న రైతులకు కొండంత భరోసా ఇస్తున్నారు. వాస్తవానికి జిల్లాలో ఇప్పటికే చాలా వరకూ వరి కోతలు పూర్తయ్యాయి. దీంతో తుపాను వర్షాలకు పంట నష్టం తీవ్రత కాస్త తక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 1.58 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు జరగగా, వర్షాలు ప్రారంభమయ్యే సమయానికి ఇంకా 51,608 ఎకరాల్లో కోతలు పూర్తి కావాల్సి ఉంది. ప్రాథమిక అంచనా ప్రకారం ఈ వర్షాలకు 15 వేల ఎకరాల్లో చేలు పడిపోగా, వీటిలో 12 వేల ఎకరాల్లో ముంపులో ఉన్నాయి.

వీడుతున్న ముంపు

ఈశాన్య రుతుపవనాల సమయమే అయినప్పటికీ ప్రస్తుతం వరుణుడు శాంతించాడు. దీంతో వాననీటి ముంపు వేగంగా వీడుతోంది. అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి, మలికిపురం, మామిడికుదురు, కాట్రేనికోన మండలాల్లో ముంపు ప్రభావం అధికంగా ఉంది. బుధవారం నుంచి వర్షాలు ఆగడం కూడా రైతులకు కలిసి వచ్చింది. ఉపాధి కూలీలతో మైనర్, రెవెన్యూ డ్రెయిన్లలో పూడిక తొలగిస్తుండగా.. మేజర్ డ్రెయిన్లలో కూడా యుద్ధప్రాతిపదికన తూడు తొలగింపు చేపట్టారు.

తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు

తుపానుకు ముందు జిల్లావ్యాప్తంగా 1,43,435 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో ఆన్‌లైన్ విధానంలో 96,965 మెట్రిక్ టన్నులు, ఆఫ్‌లైన్ విధానంలో 48,470 మెట్రిక్ టన్నులు సేకరించారు. గత శని, ఆదివారాల్లోనే ఏకంగా 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు. తుపానును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆఫ్‌లైన్ విధానంలో కొనుగోలుకు అనుమతి ఇవ్వడంతో రైతుల నుంచి పెద్ద ఎత్తున ధాన్యం సేకరించారు. అయితే రైతుల వద్ద ఉన్న ధాన్యం వర్షాలకు తడిసిపోవడంతో తేమ నిబంధనతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. 17 శాతం వరకూ తేమ ఉన్న ధాన్యానికి కనీస మద్దతు ధర ఇస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు దానిని 18 శాతం వరకూ పెంచారు. అంతకు మించి తేమ ఉంటే ఒక శాతానికి కేజీ చొప్పున అదనంగా తీసుకుని కొనుగోలు చేస్తున్నారు. ఉదాహరణకు 19 శాతం తేమ ఉంటే ఒక కేజీ చొప్పున, 20 శాతం ఉంటే 2 కేజీల చొప్పున తీసుకుని కొంటున్నారు. ఇలా 24 శాతం తేమ వరకూ కొనుగోలు చేస్తున్నారు. ఈ పద్ధతిలో గురువారం ఒక్క రోజే 9.200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం విశేషం. వర్షాల వల్ల అధికంగా పంట దెబ్బ తిన్న అల్లవరం మండలంలో ఈ ఒక్క రోజే 30 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.



అల్లవరం మండలం గూడాలలో తడిసి, తేమ ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులు

60 గంటలు.. 295.1 మిల్లీమీటర్లు

ఈ ఏడాది లోటు వర్షపాతం నమోదు కాగా, మిచాంగ్ తుపాను కారణంగా జిల్లాలో రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. మూడో తేదీ రాత్రి నుంచి ఆరో తేదీ తెల్లవారుజాము వరకూ 60 గంటల వ్యవధిలో జిల్లాలో సగటున 295.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం విశేషం. ఈ సమయంలో కురవాల్సిన వర్షం కేవలం 4 మిల్లీమీటర్లే. అంటే సాధారణం కన్నా 73.77 శాతం అధికంగా కురిసింది. నైరుతి, ఈశాన్య రుతుపవనాలు ముఖం చాటేయడంతో జూన్ నుంచి నవంబర్ వరకూ ప్రతి నెలా తక్కువ వర్షపాతమే నమోదైన విషయం తెలిసిందే. జూన్ ఒకటో తేదీ నుంచి ఈ నెల ఆరో తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా 1,156 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 565.2 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. ఈ కాలంలో ఏకంగా 55 శాతం లోటు వర్షపాతం నమోదవడం గమనార్హం

జిల్లాలో ఈ ఏడాది వర్షాలు ఇలా..

నెల	సాధారణ వర్షపాతం	కురిసినది	లోటు (శాతం)
జూన్	111.4	70.6	– 37
జూలై	241.0	189.8	– 21.2
ఆగస్టు	229.7	68.3	– 70.3
సెప్టెంబర్	196.8	174.6	– 11.3
అక్టోబర్	254.4	25.8	– 89.9
నవంబర్	122.7	36.2	– 70.5
మొత్తం	1,156.0	565.3	– 55

గుర్రపుడెక్క, తూడు తొలగించాలి

- మంత్రి విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం
- వంతెనల వద్ద కాలువల పరిశీలన



అమలాపురం చిన్న వంతెనల వద్ద కుమ్మరి కాలువను పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్, కలెక్టర్ శుక్లా

అమలాపురం టౌన్: తుపాను ప్రభావంతో మూడు రోజుల పాటు కుండపోత వర్షాలు కురిసిన నేపథ్యంలో వంతెనలు, లాకుల వద్ద గుర్రపుడెక్క, తూడు తదితర చెత్తను తొలగించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. అమలాపురం పట్టణంలోని కుమ్మరి కాలువపై శ్మశానం వద్ద ఉన్న వంతెన, చిన్న వంతెనలు, ఈదరపల్లి – నడిపూడి మధ్య కాలువపై ఉన్న వంతెనల వద్ద గుర్రపుడెక్క, తూడు నిలిచిపోవడాన్ని వారు గురువారం స్వయంగా పరిశీలించారు. ఆయా వంతెనల వద్ద డ్రెయినేజీ అధికారులతో పాటు స్థానిక రైతులతో కూడా మాట్లాడారు. ప్రవాహానికి అడ్డంగా ఉన్న గుర్రపుడెక్క, తూడు తొలగిస్తే వంతెనల వద్ద నుంచి నీరు త్వరగా దిగుతుందని, తద్వారా ముంపు సమస్యకు తక్షణ పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఈ అడ్డంకులతో పాటు పూడికలు కూడా తొలగించాలని డ్రైనేజీ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, అమలాపురం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ జె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు ప్రారంభం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: రిలయన్స్ ధీరూబాయి అంబానీ సంస్థ ఆధ్వర్యాన 8, 9, 10 తరగతుల విద్యార్థులకు స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని, ప్రతిభను వెలికితీసేవి క్విజ్ పోటీలేనని అన్నారు. పోటీతత్వం ఉన్నప్పుడే నేర్చుకోవాలన్న జిజ్ఞాస విద్యార్థుల్లో పెరుగుతుందని చెప్పారు. పాఠ్యాంశాల్లోని సిలబస్‌తో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ తెలుసుకునేందుకు ఈ క్విజ్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విజేతలకు కలెక్టర్ శుక్లా బహుమతులు అందజేశారు. ఎస్.చిరంజీవి, కె.మౌనిక (అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం జెడ్పీ హైస్కూల్) జిల్లా స్థాయి ప్రథమ స్థానం సాధించారని రిలయన్స్ సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి రూ.40 వేల విలువైన రెండు ల్యాప్‌ట్యాప్‌లు బహూకరించామన్నారు. ద్వితీయ బహుమతి సాధించిన కె.సాత్విక్, ఆర్.వర్షిత(రావులపాలెం మండలం వెదిరేశ్వరం జెడ్పీ హైస్కూల్)లకు ఒక్కొక్కరికి రూ.20 వేల విలువైన రెండు ట్యాబ్‌లు అందజేశామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల విభాగం నుంచి విజేతలుగా నిలిచిన 14 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.7 వేల విలువైన సైకిళ్లు అందించామన్నారు. ఈ క్విజ్ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 110 పాఠశాలలకు చెందిన 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ సంస్థ హెచ్‌ఆర్ హెడ్ వి.శ్రీనివాసరావు, క్విజ్ మాస్టర్ కమాండెంట్లు శ్రీనివాస్, షరీఫ్ పాల్గొన్నారు.

వాయువేగంతో వెలుగులు

- తుపాను వేళ విద్యుత్ శాఖ అప్రమత్తం
- తీవ్ర గాలులకు నేలకొరిగిన స్తంభాలు
- కొన్నిచోట్ల దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు
- 752 గ్రామాల్లో నెలకొన్నఅంధకారం
- యుద్ధప్రాతిపదికన పని చేసిన ఈపీడీసీఎల్
- గంటల వ్యవధిలోనే సరఫరా పునరుద్ధరణ

గతం	నేడు
తుపాను వస్తే ముందు ప్రభావితమై ఇబ్బంది కలిగించేది విద్యుత్ సరఫరా. బలమైన ఈదురు గాలులకు ఎక్కడికక్కడే వైర్లు తెగిపోతాయి. కొన్నిచోట్ల స్తంభాలు కూలిపోతాయి. ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరుగుతాయి. ప్రకృతి విపత్తు ఎదురైన ప్రతి సందర్భంలోనూ జరిగే సాధారణ పరిణామం ఇది. తుపాను కదా.. కరెంటు ఇంత తొందరగా రాదని ప్రజలూ సర్దుకుపోయేవారు. ఇదంతా గతం.	తుపాను వస్తోంది. బలమైన గాలులూ వీస్తున్నాయి. దీంతో విద్యుత్ లైన్లు చాలాచోట్ల తెగి పడిపోతున్నాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బ తింటున్నాయి. నిన్నటి మిచాంగ్ తుపాను సందర్భంలోనూ ఈ పరిస్థితులు ఎదురయ్యాయి. అయితే విద్యుత్ సరఫరా నిలిచిపోయినా సాధ్యమైనంత తక్కువ సమయంలోనే ఆ శాఖ అధికారులు పునరుద్ధరించగలిగారు. ఈదురు గాలులు వీచినచోట కూడా గంటల్లోనే సరఫరా ఇవ్వగలిగారు.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: తుపాను వంటి ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు విద్యుత్ సరఫరా చాలా కీలకం. మిగిలిన అన్ని విభాగాల కంటే విద్యుత్ వ్యవస్థ అప్రమత్తంగా పని చేయకుంటే తీరని ప్రాణ నష్టం సంభవిస్తుంది. ఎక్కువ ఇబ్బందులను కలిగిస్తుంది. అటువంటిది మిచాంగ్ తుపాను సంకేతాలు రాగానే ప్రభుత్వం ముందుగానే అన్ని కోణాల్లో అప్రమత్తమైంది. ఎక్కువగా ప్రభావితమయ్యే విద్యుత్ రంగంపై ఎక్కువ ఫోకస్ పెట్టింది. ఫలితంగా ఎక్కడా ప్రాణ నష్టం సంభవించలేదు. ప్రభుత్వ ఆదేశాలతో ఏపీ ఈపీడీసీఎల్ ముందుగానే మేల్కొని అహరహం శ్రమించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను నియమించింది. 24 గంటలూ పని చేసేలా చూసింది. కరెంటు సమస్యలు ఎదురైన చోట వెనువెంటనే స్పందించింది. త్వరితగతిన సరఫరాను పునరుద్ధరించింది.

వందల గ్రామాల్లో చీకట్లు

విద్యుత్ సరఫరాలో అత్యంత కీలకమైన 11 కేవీ ఫీడర్లు, 11 కేవీ లైన్లు, 11/33 కేవీ లైన్లు, సబ్ స్టేషన్లు, విద్యుత్ స్తంభాలు వందల సంఖ్యలో భారీ గాలులకు దెబ్బ తిన్నాయి. దీంతో, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని వందల గ్రామాలు, పట్టణాల్లో సోమవారం రాత్రి నుంచి చీకట్లు అలముకున్నాయి. ఈదురు గాలులు, ఎడతెరిపి లేని వర్షాలకు విద్యుత్ సరఫరా జరిగితే ఆస్తి నష్టం కంటే ప్రాణ నష్టం ఎక్కువగా ఉంటుందని అంచనా వేసిన ఏపీ ఈపీడీసీఎల్ యంత్రాంగం ముందుగానే అప్రమత్తమైంది. మెజార్టీ తీర ప్రాంత గ్రామాల్లో ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరాను నిలిపివేసింది. ఇటువంటి గ్రామాలు కోనసీమ జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లో మాత్రం తుపాను ప్రభావంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నష్టం జరిగినవి	తూర్పుగోదావరి	కాకినాడ	కోనసీమ
33 కేవీ ఫీడర్లు	46	14	24
11 కేవీ ఫీడర్లు	238	118	178
33/11 కేవీ సబ్ స్టేషన్లు	46	26	28
33 కేవీ స్తంభాలు	14	2	0
11 కేవీ స్తంభాలు	107	88	72
ఎల్‌టీ స్తంభాలు	66	90	108
ట్రాన్స్‌ఫార్మర్లు	32	30	57
నష్టం (రూ. లక్షలు)	68.20	87.81	81.84

గతంలో అయోమయం

గత ప్రభుత్వాల హయాంలో తుపానులు, వరదలు వస్తే అసలు విద్యుత్ సరఫరా ఎన్ని రోజులకు పునరుద్ధరిస్తారో తెలియని అయోమయ పరిస్థితులు ఉండేవి. కోనసీమలోని లంక గ్రామాల్లో మరీ దారుణంగా ఉండేది. రోజుల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. అయినా నాటి పాలకులు ఈ సమస్యను పెద్దగా పట్టించుకునేవారు కాదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరించింది. తుపాను తీరం దాటాక మంగళవారం సాయంత్రం నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. బలమైన ఈదురు గాలులు వీచాయి. కొన్నిచోట్ల అనూహ్యంగా సుడిగాలులు విధ్వంసం సృష్టించాయి. ఈ ప్రభావంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎల్‌టీ, కేవీ లైన్లతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలో 300 వరకూ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రూ.2.37 కోట్ల మేర నష్టం జరిగినట్టు ఈపీడీసీఎల్ అధికారులు నిర్ధారణకు వచ్చారు.



కొత్తపేటలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

ఆగమేఘాలపై చర్యలు

నష్టం మాటెలా ఉన్నా గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా చీకట్లు అలముకున్న అన్ని ప్రాంతాలకూ ఏక కాలంలో యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అప్రమత్తం చేశారు. దీంతో దిగువ స్థాయిలో అధికారులు, సిబ్బంది మరింత స్పందించి పని చేశారు. ఈపీడీసీఎల్‌లో సీనియర్ ఇంజినీర్ల నుంచి లైన్‌మెన్ వరకూ 350 మంది 35 బృందాలుగా ఏర్పడి పని చేశారు. విద్యుత్ లైన్లు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాయి. రికార్డు స్థాయిలో చాలాచోట్ల గంటల వ్యవధిలోనే సరఫరా పునరుద్ధరించారు. బుధవారం రాత్రికే 90 శాతం ప్రాంతాలకు మళ్లీ కరెంటు ఇవ్వగలిగారు. ఈ రకంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 36 మండలాల్లోని 752 గ్రామాలు, పట్టణాల్లో మళ్లీ విద్యుత్ వెలుగులు ప్రసరించేలా చర్యలు తీసుకోగలిగారు. ముంపు బారిన పడిన వ్యవసాయ, ఆక్వా విద్యుత్ కనెక్షన్లను మాత్రమే పునరుద్ధరించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. మున్నెన్నడూ ఇలా స్పందించి వెంటనే కరెంటు వచ్చింది లేదని రాజమహేంద్రవరానికి చెందిన వ్యాపారి వెంకట్రావు చెప్పారు.

సమన్వయంతోనే పునరుద్ధరణ



దాదాపు అన్ని గ్రామాలు, పట్టణాల్లోనూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాం. ఎక్కడికక్కడ సిబ్బంది, అధికారులు సమన్వయంతో పని చేశారు. దీంతో 24 గంటల్లోనే సమస్యలను చక్కదిద్దాం. తుపాను హెచ్చరికలతో తీర ప్రాంత మండలాల్లో ముందుగా స్తంభాలు, విద్యుత్ లైన్లు, మెటీరియల్ సిద్ధం చేసుకున్నాం. స్తంభాలకు మనుషులు గోతులు తవ్వే అవసరం లేకుండా డ్రిల్లింగ్ మెషీన్లు ఏర్పాటు చేశాం. దీంతో పని మరింత వేగంగా జరిగింది. ప్రజలు కూడా పెద్ద ఎత్తున స్పందించి స్వచ్ఛందంగా సహకరించారు. అందువల్లే త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం సాధ్యమైంది. స్తంభాలు ఎక్కువగా దెబ్బ తిన్నాయి.

– టీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ, ఈపీడీసీఎల్

క్లుప్తంగా

స్కూల్ బస్సు ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి

రంగంపేట: స్కూల్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ఎస్సై పి.విజయకుమార్ కథనం ప్రకారం.. రంగంపేట మండలం జి.దొంతమూరుకు చెందిన చెక్కపల్లి సత్యనారాయణ (26) గురువారం ఆ గ్రామం నుంచి బాలవరం వైపు ట్రాక్టర్ నడుపుతూ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఆ ట్రాక్టర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ రోడ్డు పక్కకు బోల్తా పడి, సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి చెక్కపల్లి వీరకొండ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కపిలేశ్వరపురం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని మాచర గ్రామ శివారు మాచర మట్టలు గ్రామానికి చెందిన పంపన సూరిబాబు (45) మద్యానికి బానిసయ్యాడు. దీనికితోడు మనస్పర్థలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అతడు బుధవారం రాత్రి తన ఇంటి డాబాపైకి వెళ్లి పిల్లర్లకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య భవాని, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సూరిబాబు మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని అంగర ఎస్సై జి.చంటి తెలిపారు.

లారీ కింద పడి మరో డ్రైవర్ మృతి

రాయవరం: గ్రామ శివార్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక లారీ డ్రైవర్ మరో లారీ కింద పడి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన పలువురిని కలచివేసింది. రంగంపేట మండలం జి.దొంతమూరుకు చెందిన ఉద్దండి పెదకాపు (42) లారీ డ్రైవర్‌గా పని చేస్తూంటాడు. అతడు బిక్కవోలు మండలం పందలపాకలో నివాసముంటున్నాడు. రాయవరం – కొమరిపాలెం మార్గంలో గురువారం రాయవరం నుంచి పందలపాక బైక్‌పై వెళ్తుండగా అతడిని మరో లారీ ఢీకొన్నట్లు సమాచారం. లారీ ముందు టైరు మీద నుంచి వెళ్లడంతో పెదకాపు తల భాగం నుజ్జునుజ్జయ్యింది. ఆ ప్రాంతం భీతావహంగా మారింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే రాయవరం ఎస్సై జి.నరేష్ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రాథమిక విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

బడ్జెట్ తయారీలో బిజీబిజీ

- హేబిటేషన్, పాఠశాల స్థాయిల్లో యూ–డైస్ నమోదు
- 2022–23 యూ–డైస్ ఆధారంగా వచ్చే ఏడాది బడ్జెట్ రూపకల్పన



రాయవరం: ప్రణాళిక లేకుండా చేసిన ఏ పనీ విజయవంతం కాదు. జాతి నిర్మాణాలకు వేదికలైన పాఠశాలల్లో మౌలిక, భౌతిక అవసరాలకు ఏటా ప్రణాళికలు రూపొందిస్తూంటారు. ఇందులో భాగంగా క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ప్రస్తుతం బడ్జెట్ ప్లానింగ్ చేపడుతున్నారు. హేబిటేషన్, పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్, మండల స్థాయిలో ప్రణాళిక అనంతరం జిల్లా స్థాయి ప్రణాళిక రూపొందించి, రాష్ట్ర స్థాయికి నివేదించనున్నారు. ఏకీకృత జిల్లా విద్యా సమాచార వ్యవస్థ(యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్)ను యూ–డైస్‌గా పేర్కొంటారు. 2000 సంవత్సరం నుంచి ఏటా సెప్టెంబరు 30వ తేదీని ప్రాతిపదికగా తీసుకుని యూ–డైస్ ద్వారా పాఠశాలల సమాచారం సేకరిస్తున్నారు. దీని ఆధారంగా ఏటా పాఠశాలలకు అవసరమైన భౌతిక, మౌలిక అవసరాలను గుర్తిస్తారు. 2023–24 బడ్జెట్‌కు 2022–23 యూ–డైస్ సమాచారం ప్రాతిపదికగా తీసుకుని సమగ్ర శిక్షా బడ్జెట్ రూపకల్పనకు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థులు, పాఠశాలల అవసరాలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందిస్తారు. అనంతరం ఆమోదానికి సమగ్ర శిక్షా కేంద్ర కార్యాలయానికి పంపిస్తారు. దీని ఆధారంగా కేంద్రం తన వాటా నిధులు మంజూరు చేస్తుంది.

విద్యా ప్రణాళిక ఎందుకంటే..

పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కావాలన్నా, ఉన్న పోస్టులను రేషనలైజేషన్ చేయాలన్నా, కొత్తగా అదనపు తరగతి గదులు, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ర్యాంపులు, వంట గదులు, లేబొరేటరీ గదులు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఉపకరణాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, దివ్యాంగులకు ఉపకరణాలు, డిజిటల్ విద్య ఇలా ప్రభుత్వం ఏది మంజూరు చేయాలన్నా బడ్జెట్‌లో పాఠశాలల అవసరాల నమోదు తప్పనిసరి.

శిక్షణ పూర్తి

బడ్జెట్ రూపకల్పనలో భాగంగా జిల్లా సెక్టోరియల్ అధికారులకు రాష్ట్ర స్థాయిలో గత నెల 12న ఒక రోజు ఓరియంటేషన్ ఇచ్చారు. బడ్జెట్ తయారు చేసే విధానంపై గత నెల 16న జిల్లా స్థాయిలో ఎంఈఓలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. బడ్జెట్ తయారీలో భాగంగా తొలుత గ్రామంలో హేబిటేషన్ ప్లాన్ తయారు చేస్తారు. అనంతరం పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్, మండల స్థాయిల్లో ప్రణాళికలు తయారు చేస్తారు. మండల స్థాయి ప్రణాళికల్లోని సమాచారాన్ని క్రోడీకరించి జిల్లా స్థాయి అవసరాలకు అనుగుణంగా వార్షిక వర్క్ ప్లాన్ బడ్జెట్ అండ్ ప్లానింగ్ తయారు చేస్తారు.

బడ్జెట్ రూపకల్పనలో నిమగ్నం



విద్యా శాఖ బడ్జెట్ రూపకల్పనలో ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. బడ్జెట్ తయారీకి యూ–డైస్ సమాచారం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

11 నుంచి జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: ఈ నెల 11, 12 తేదీల్లో బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ ఎస్‌డీవీ రమణ గురువారం ఈ విషయం తెలిపారు. ఈ పోటీలకు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, కేజీబీవీ, ఏపీ మోడల్, ఉన్నత పాఠశాల ప్లస్‌లలో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. గాత్రం (సంగీతం), గాత్రం (జానపద), వాద్య సంగీతం (వాద్య), వాద్య సంగీతం (మెలోడి), నాట్యం (సంప్రదాయ), నాట్యం (జానపద) విభాగాల్లో 11న పోటీలు జరుగుతాయని తెలిపారు. అలాగే, 12న దృశ్య కళలు (ద్విమితీయ), దృశ్య కళలు (త్రిమితీయ), సంప్రదాయబద్ధ ఆటబొమ్మలు, ఆటలు, నాటిక (ఏకాపాత్రాభినయం) విభాగాల పోటీలు జరుగుతాయన్నారు. ఒక విద్యా సంస్థ నుంచి ఒక్కో కళా రూపంలో ఒక బాలుడు, ఒక బాలిక విడివిడిగా పాల్గొనాలన్నారు. గత ఏడాది జరిగిన పోటీల్లో బహుమతులు సాధించిన వారు ఈ ఏడాది అనర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు అవసరమైన సామగ్రి తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. పాఠశాల తరఫున పాల్గొనే వారి వివరాలు, పోటీ అంశాలను నిర్దేశిత ప్రొఫార్మాలో gdieteg@gmail.com ఈ–మెయిల్‌కు లేదా అధ్యాపకులు కేవీ సూర్యనారాయణకు 99496 02721, కె.గంగాధరరావుకు 94403 39416, ఎస్.బాలరాజుకు 89196 91293 నంబర్లలో వాట్సాప్ చేసి, నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు పై నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పాలు తీయడానికి వెళ్తూ..
తిరిగి రాని లోకాలకు..


అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు


మృతుడు శ్రీనివాస్ (పాత చిత్రం)

నల్లజర్ల: పశువులకు పాలు తీయడానికి వేకువజామునే బైక్‌పై వెళ్తున్న ఇద్దరు రైతు సోదరులను వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అవిర్ని శ్రీనివాస్ (50) ఆసుపత్రిలో మృతి చెందాడు. ఆయన సోదరుడు శ్రీధర్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. అనంతపల్లికి చెందిన శ్రీధర్, శ్రీనివాస్ గురువారం ఉదయం 5 గంటల సమయంలో పాలు తీయడానికి ఒకే బైక్‌పై పొలం వెళ్తున్నారు. వారితో పాటు మరో రైతు వలిరెడ్డి అర్జున్ కూడా వేరే బైక్‌పై వెళ్తున్నాడు. అనంతపల్లి ఎర్ర కాలువ బ్రిడ్జి దాటి సంజీవపురం సమీపానికి వచ్చేసరికి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఓ కారు అతి వేగంగా వచ్చి శ్రీధర్ నడుపుతున్న బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న శ్రీనివాస్ ఎగిరి పక్కనే ఉన్న రెయిలింగ్‌పై పడ్డాడు. అతడి శరీరం అంతా చీరుకుపోయింది. శ్రీధర్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. అన్నదమ్ములిద్దరినీ హైవే అంబులెన్సులో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు. శ్రీధర్ చికిత్స పొందుతున్నాడు. వీరిని ఢీకొన్న ముదురు తెలుపు రంగు కారును నడుపుతున్న వారు టోల్‌ప్లాజా వరకూ వెళ్లి, దొరికిపోతామన్న భయంతో అంతలోనే వెనుతిరిగి ఏలూరు వైపు వెళ్లిపోయారు. నంబరు ప్లేటు పగిలిపోవడంతో కారు ఆచూకీ లభించలేదు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

12 టన్నుల బియ్యం స్వాధీనం

కొవ్వూరు/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదహారో నంబర్ జాతీయ రహదారిపై అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాల అధికారులు గురువారం పట్టుకున్నారు. రీజినల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ ఎ.సురేష్‌బాబు, పౌర సరఫరాల శాఖ కొవ్వూరు డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు కథనం ప్రకారం.. ముందుగా అందిన సమాచారం మేరకు ఉదయం 7.30 గంటల సమయంలో జాతీయ రహదారిపై కొవ్వూరు మండలం గోవర్ధనగిరి మెట్ట సమీపాన విజిలెన్స్ అధికారులు లారీని ఆపి తనిఖీ చేశారు. ఆ లారీలో 246 ప్లాస్టిక్ బస్తాల్లో నింపి ఉన్న 12 టన్నుల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జంగారెడ్డిగూడేనికి చెందిన తొండాపు శ్రీనివాసరెడ్డి ఈ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలిస్తున్నట్లు గుర్తించారు. రాజానగరం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన లారీ డ్రైవర్ మహంకాళి శ్రీనివాసరావు, కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ నందూరి బాపిరాజుపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.13,04,000గా అంచనా వేశారు. ఈ దాడిలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ తాడి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, బాపిరాజు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని నిడదవోలులోని పౌర సరఫరాల గోదాముకు తరలించారు. లారీని కొవ్వూరు రూరల్ పోలీసులకు అప్పగించారు.

ఈ కేసులో లారీ యజమాని, లారీ డ్రైవర్‌తో పాటు బియ్యం యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ సురేష్‌బాబు తెలిపారు. ఎవరైనా రేషన్ బియ్యం కొన్నా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు


ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: కార్తిక మాసం బహుళ దశమిని పురస్కరించుకుని సామర్లకోట పంచారామ క్షేత్రమైన శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యాన తెల్లవారుజామున గోపూజ, స్వామివారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ భక్తులు ఆలయంలో కార్తిక దీపారాధనలు చేశారు. సాయంత్రం అమ్మవారికి, స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన

పంచారామ క్షేత్రంలో రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన భక్తులను ఆకట్టుకుంది. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో రూ.2,500 చెల్లించి లక్షపత్రి పూజలు చేసుకునే భక్తుల కోసం ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపానికి పూజలు చేసి, వెలిగించిన అనంతరం, లక్షపత్రి పూజలు చేసుకున్న భక్తులు జ్యోతిర్లింగార్చన చేశారు. ఆకాశ దీపం వద్ద పూజా కార్యక్రమంలో దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, అర్చకులు పాల్గొన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు


సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు


సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం గురువారం వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. బహుళ దశమిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో రద్దీ నెలకొంది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించారు. సత్యదేవుని వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. తుపాను ముప్పు తప్పడంతో పాటు పర్వదినాలు కావడంతో సత్యదేవుని ఆలయానికి శుక్రవారం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. శుక్రవారం ఏకాదశి, శని, ఆదివారాలు సెలవు దినాలు, సోమవారం ఆఖరి కార్తిక సోమవారం కావడంతో సత్యదేవుని సన్నిధికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నాలుగు రోజులు స్వామివారి ఆలయాన్ని తెల్లవారుజామున ఒంటిగంటకు తెరిచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఒంటి గంట నుంచే స్వామివారి వ్రతాలు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. వ్రతాల టిక్కెట్లు ముందు రోజు రాత్రి పది గంటలకే విక్రయిస్తారన్నారు. ఈ నాలుగు రోజుల్లో సుమారు మూడు లక్షలకు పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ జిల్లా పరిశీలకుడు యువరాజు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిశీలకుడు యువరాజ్, కలెక్టర్ శుక్లా

సాక్షి, అమలాపురం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల కార్యదర్శి, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ జిల్లా పరిశీలకుడు ఎస్.యువరాజ్ అధికారులను ఆదేశించారు. వచ్చే జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా ఉండాలని అన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణపై ఈఆర్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన గురువారం సమీక్షించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో యువరాజ్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో అర్హులైన అందరూ ఓటు హక్కు వినియోగించుకోవడమే లక్ష్యంగా ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్నామని చెప్పారు. చనిపోయిన ఓటర్లను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నోటీసులు ఇస్తూ తొలగించాలని స్పష్టం చేశారు. జాబితాలో చేర్పులు, మార్పులను ఎటువంటి పొరపాట్లకూ తావివ్వకుండా పూర్తి కచ్చితత్వంతో నిర్వహించాలని అన్నారు. గ్రామ పంచాయతీలు, వార్డు సచివాలయాల్లో నోటీసులు ప్రదర్శించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓలు, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పని చేసి వివాదాలకు తావు లేని విధంగా పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపకల్పనకు కృషి చేయాలని యువరాజు అన్నారు.

జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణపై కలెక్టర్ హిమాన్షు శుక్లా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,644 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా 14,88,794 మంది ఓటర్లున్నారని, వీరిలో 7,40,749 మంది పురుషులు, 7,48,023 మంది స్త్రీలు, 22 మంది ఇతరులు ఉన్నారన్నారని వివరించారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి అన్ని చర్యలూ చేపట్టామని, ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్‌డీఓలు ఎం.ముక్కంటి, ఎస్.సుధాసాగర్, జి.కేశవవర్ధనరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, షేక్ అబ్దుల్ ఖాదర్ (వైఎస్సార్ సీపీ), డి.రాజేష్ (బీజేపీ), అల్లాడి స్వామినాయుడు (టీడీపీ), కామన ప్రభాకరరావు (కాంగ్రెస్) పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

ఆత్రేయపురం: వరకట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం. ర్యాలికి చెందిన జగతా పద్మ నాగమణి సాయికుమారికి, అదే గ్రామానికి చెందిన జగతా రాంబాబుకు 2019లో వివాహమైంది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. పెళ్లయిన కొంత కాలం తర్వాత అదనపు కట్నం కోసం భర్త రాంబాబు, అత్త సత్యవతి, వానపల్లి మహాలక్ష్మి సాయికుమారిని వేధిస్తున్నారు. ఇటీవల వేధింపులు ఎక్కువయ్యాయని, దీనికి తోడు రాంబాబు రోజూ తాగి వచ్చి తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని సాయికుమారి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

- పోలీసులకు కాకినాడ ఎస్పీ ఆదేశం
- టూటౌన్ స్టేషన్ తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ లీగల్: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పోలీసులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు ఆయన తనిఖీ చేశారు. సీఐలు, ఎస్సైలు, పోలీసులతో మాట్లాడుతూ, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నగరంలో శాంతి భద్రతల పరిరక్షణపై పూర్తి స్థాయి నిఘా ఉంచాలని సూచించారు. పాత నేరస్తులపై కూడా ఒక కన్ను వేయాలని అన్నారు. మహిళా పోలీసులు కూడా అన్ని విధాలా చురుకుగా ఉంటూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, దిశ డీఎస్పీ జయరామ్ ప్రసాద్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.